www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 24 సెప్టెంబరు 2023 | 5 | పశ్చిమ గోదావరి

అర్జునరాజు సేవలు వెలకట్టలేనివి : సిపిఎం

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల మరణించిన ఉండి గ్రామ మాజీ సర్పంచి, రిటైర్డ్ ఇంజినీర్, రైతుపోరాట ఉద్యమ నాయకులు గొట్టుముక్కల అర్జునరాజు (90) సేవలు వెలకట్టలేనివని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. శనివారం అర్జునరాజు కుటుంబాన్ని సిపిఎం నేతలు పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గోపాలన్ మాట్లాడుతూ అర్జునరాజు సర్పంచిగా గ్రామానికి ఎన్నో సేవలందించారని కొనియాడారు. రైతుపోరాట ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారని వారిని గుర్తు చేశారు. అర్జున రాజు కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట సిపిఎం మండల కార్యదర్శి ధనకొండ శ్రీనివాస్, నాయకులు కడలి నాగేశ్వరరావు ఉన్నారు.

చెప్పిందేంటీ.. చేస్తున్నదేంటీ..!

జిపిఎస్ అమలు నిర్ణయంపై ఉద్యోగులు ఆగ్రహం
ఎన్నికల్లో ఒపిఎస్ అమలుకు హామీ ఇచ్చి మోసగిస్తారా
సిపిఎస్ కంటే దారుణమైన జిపిఎస్‌ను
అంగీకరించేదిలేదంటున్న ఉద్యోగ సంఘాల నేతలు
నిరసనలకు ఫ్యాప్టో పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తాము అధికారంలోకి వస్తే వారం, పది రోజుల్లోనే సిపిఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్)ను రద్దు చేసి ఉద్యోగులకు ఒపిఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీమ్) అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వం తమ జీవితాలతో ఆడుకుంటుందని ఉద్యోగులు, ఉద్యోగసంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఎన్నికల్లో 'మీరు చెప్పిందేంటీ.. ఇప్పుడు చేస్తున్నదేంటీ' అంటూ వైసిపి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అధికారంలోకొచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ తెస్తామని హామీ ఇచ్చి నాలుగున్నరేళ్ల తర్వాత జిపిఎస్ అమలుకు ప్రభుత్వం ముందుకు సాగడం అత్యంత దారుణమని ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తెస్తున్న జిపిఎస్ కంటే ప్రస్తుతం అమలులో ఉన్న సిపిఎస్సే మెరుగైందని, తమకు ఒపిఎస్ అమలు మాత్రమే అంగీకారమని తెగేసి చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వేలాది సంఖ్యలో సిపిఎస్ ఉద్యోగులు ఉన్నారు. వీరంతా ఎన్నోఏళ్లుగా సిపిఎస్ రద్దు కోసం పోరాడుతున్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలోనూ ర్యాలీలు, నిరసనలు, కలెక్టరేట్ ముట్టడి వంటి అనేక ఆందోళనలు చేసిన పరిస్థితి ఉంది. ఎన్నికల ముందు ఉద్యోగులు కోరిన ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే సిపిఎస్‌ను రద్దు చేస్తామని వైసిపి అధ్యక్షుని హోదాలో జగన్ హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకొచ్చాక ఆ మాటే మరిచిపోయారు. దీంతో ఉద్యోగులు మళ్లీ ఆందోళనల బాట పట్టాల్సి వచ్చింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగుల ఆందోళనలు తీవ్రతరం కావడంతో సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తెస్తామంటూ ప్రభుత్వం కొత్త పల్లవి అందుకుంది. జిపిఎస్‌ను ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం వెనక్కి తగ్గకుండా జిపిఎస్ అమలుకు రాష్ట్ర మంత్రి మండలిలో సైతం తీర్మానం చేసింది. దీంతో ఉద్యోగులు మరోసారి ఆందోళనబాట పట్టారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో తహశీల్దార్, కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ఆందోళనకు ఇప్పటికే పిలుపునిచ్చారు. తమకు జిపిఎస్ వద్దని, ఒపిఎస్ కావాలని నినదిస్తున్న పరిస్థితి ఉంది.

ఉద్యోగులంతా జిపిఎస్‌కు వ్యతిరేకమే

సిహెచ్.శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మన్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా

ప్రభుత్వం చెబుతున్న జిపిఎస్‌కు ఉద్యోగులంతా వ్యతిరేకమే. సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ తీసుకురావాలని ఉద్యోగులు కోరుతున్నారు. కంట్రిబ్యూషన్ లేని మెరుగైన పెన్షన్ భద్రత ఉండాలి. అప్పుడే ఉద్యోగులకు మేలు జరుగుతుంది.

పెనంపై నుంచి పొయ్యిలో పడ్డట్టే

జి.కృష్ణ, ఎపిటిఎఫ్ 1938, జిల్లా ప్రధాన కార్యదర్శి

సిపిఎస్‌ను రద్దు చేసి జిపిఎస్ అమలు చేస్తే ఉద్యోగులంతా పెనంపై నుంచి పొయ్యిలో పడినట్లే. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు మాట మార్చడం దారుణం. జిపిఎస్ కావాలని ఉద్యోగులు ఎవరైనా అడిగారా ప్రభుత్వం చెప్పాలి. ఒపిఎస్‌కు ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదు. చాలా రాష్ట్రాల్లో ఒపిఎస్ ఇచ్చారు. ఉద్యోగులను మోసం చేయడం దారుణం.

సిపిఎస్ కంటే జిపిఎస్ దుర్మార్గమైంది

ఆర్.రవికుమార్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

జిపిఎస్‌ను ఉద్యోగులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ప్రస్తుతం అమలులో ఉన్న సిపిఎస్ కంటే జిపిఎస్ దుర్మార్గమైన స్కీమ్. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఎటువంటి సొమ్మూ రాదు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేదిలేదు. ఇప్పటికే ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాం. 25న చలో కలెక్టరేట్ కార్యక్రమం సైతం నిర్వహించనున్నాం.

ఒపిఎస్ ఇస్తేనే ఉద్యోగులకు సంతోషం

కె.రమేష్, ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్

ఏఒక్క ఉద్యోగీ జిపిఎస్‌ను అంగీకరించే పరిస్థితి లేదు. ఒపిఎస్‌ను అమలు చేస్తేనే ఉద్యోగులు సంతోషంగా ఉంటారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఒపిఎస్‌ను అమలు చేయాలి. ఉద్యోగ సంఘాల నాయకులుగా తామంతా ఒపిఎస్‌నే కోరుకుంటున్నాం.

కంట్రీబ్యూషన్ అనేది ఉండకూడదు

పిబివిఎన్ఎల్ నారాయణ, ఫ్యాప్టో చైర్మన్

ఉద్యోగులు కోరుతున్నది ఒక్కటే జిపిఎస్ వద్దు.. ఒపిఎస్ కావాలని. ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం ఏమాత్రం సహేతుకం కాదు. జిపిఎస్‌లో ప్రతినెలా పది శాతం కటింగ్ అవుతుంది. కంట్రిబ్యూషన్ అనేది తీసేసి ఒపిఎస్ అమలు చేయాలి. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉద్యోగులెవ్వరూ సమ్మతించడం లేదు.

జిపిఎస్‌లో ఉద్యోగ విరమణ పొందాక సొమ్ము రాదు

బొరగం రెడ్డిదొర, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

సిపిఎస్‌లో పదిశాతం ఉద్యోగుల సొమ్ము, పది శాతం ప్రభుత్వ సొమ్ము కంట్రీబ్యూషన్ ఉంటుంది. జిపిఎస్‌లో ఉద్యోగులకు సంబంధించిన పదిశాతం మాత్రమే ఉంటుంది. సిపిఎస్ కంటే జిపిఎస్ మరింత దారుణమైన పెన్షన్ పథకం. ఉద్యోగ విరమణ పొందాక జిపిఎస్ విధానంలో సొమ్ములేవీ రావు. ప్రభుత్వ నిర్ణయం ఏమాత్రం ఒప్పుకోం. ఉద్యోగ విరమణ పొందాక ఉద్యోగుల పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉంటుందని చెబుతున్నారు. అప్పటి వరకూ పిల్లల చదువులు పూర్తి కాకుండా ఉంటాయా.. ప్రభుత్వం చెప్పాలి.

ఉండి మండలం కలిసిపూడి కాలనీలో పర్యటించిన కలెక్టర్ ప్రశాంతి

ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయండి

క్షేత్రస్థాయిలో పనులను అధికారులు పర్యవేక్షించాలి
జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - ఉండి

జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసి, మిగిలిన ఇళ్ల నిర్మాణం అక్టోబరు నెలాఖరుకు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖాధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలిసిపూడి జగనన్న లేఅవుట్‌లో గృహ ప్రవేశాలైన ఇళ్లు, నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఆమె శనివారం పరిశీలించారు. మొత్తం 24 ఇళ్లకు 13 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యి నివాసం ఉంటున్నారని, మిగిలిన 11 ఇళ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయని గృహనిర్మాణ శాఖ పీడీ ఆర్‌సి.ఆనందకుమార్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడ నివాసం ఉంటున్న మహిళలతో మాట్లాడారు. సమస్యలు, బిల్లుల పెండింగ్ గురించి ఆరా తీశారు. అంతర్గత రహదారులు ఏర్పాటు చేయాలని మహిళలు కోరారు. మండల పరిషత్ నిధులతో వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు బిల్లులు ఎప్పటికప్పుడు జమయ్యేలా చూడాలన్నారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇళ్లనిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్‌విఎస్.నాయుడు, ఎంపిడిఒ ఎవి.అప్పారావు, గృహనిర్మాణ శాఖ డిఇ పి.శివరామరాజు, ఎఇ డి.రామకృష్ణంరాజు, సచివాలయ, రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

వీరవాసరం: పేదలందరికీ ఇళ్లు కింద ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరగాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె శనివారం మండలంలోని అండలూరులో హౌసింగ్ లేఅవుట్‌ను, తోలేరు, నౌడూరు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అండలూరు లేఅవుట్‌లో మొత్తం 18 పట్టాలివ్వగా, ఎనిమిది ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందని, మిగిలిన పది ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని హౌసింగ్ పీడీ ఆనందకుమార్ కలెక్టర్‌కు వివరించారు. మండలంలో మిగిలిన లేఅవుట్ల ప్రగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆప్షన్-3 కింద కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణం డిసెంబర్ 25 నాటికి తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. లేఅవుట్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యతివ్వాలని కలెక్టర్ సూచించారు.

చచ్చినా..చావేనా..!

దళిత రక్షణ యాత్ర బృందం వద్ద దళితు ఆవేదన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

76 ఏళ్ల స్వాతంత్ర దేశంలో నేటికీ దళితులు ఎవరైనా చనిపోతే ఖననం చేసేందుకు శ్మశాన స్థలం లేక కాల్వ గట్లు, రోడ్ల పక్కన పూడ్చిపెట్టాల్సిన పరిస్థితి ఉందని, తమకు తక్షణం శ్మశాన స్థలం కేటాయించేలా చూడాలని కోరుతూ కొత్తూరు శివారు ఇందిరానగర్ దళితులు దళిత రక్షణ యాత్ర బృందానికి వినతిపత్రం అందజేశారు. దళిత రక్షణ యాత్ర శనివారం మూడోరోజు ఆచంట నుంచి బయల్దేరి పెనుగొండ, ఇరగవరం, తణుకు మీదుగా తాడేపల్లిగూడెం మండలం కృష్ణయ్యపాలెం, కొత్తూరు ఇందిరానగర్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఇందిరానగర్ దళితులు మాట్లాడుతూ తమకు ఎవరికీ సెంటు భూమి లేదని, మనిషి చచ్చిపోయినా పూడ్చి పెట్టడానికి శ్మశాన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఇళ్లస్థలాలు సైతం ఇవ్వలేదని వాపోయారు. తక్షణమే శ్మశాన స్థలం, ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా యాత్రను ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ తక్షణమే సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. స్పందన రాకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుదామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు పెట్ల కృపారావు, కండెల్లి బాబూరావు, దేపల్లి సూరిబాబు, మోర్ల నాగేశ్వరరావు, ఆలమండ కోటయ్య, లంక సీమమ్మ, మారంపూడి చిట్టమ్మ, అప్పలమ్మ పాల్గొన్నారు.

తణుకు: మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు

తాడేపల్లిగూడెం టౌన్: దళిత రక్షణ యాత్ర జాతా తాడేపల్లిగూడెం పట్టణానికి చేరుకున్న సందర్భంగా పోలీసు ఐల్యాండ్ వద్ద నేతలు ఘనస్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహానికి కెవిపిఎస్, వ్యకాస నేతలు కె.క్రాంతిబాబు, జక్కంశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ నెల 29న విజయవాడలో మహాధర్నాను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. యాత్రకు స్వాగతం పలికిన వారిలో సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, నేతలు కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, పోతు శ్రీను, మడక రాజు, పతివాడ నాగేంద్రబాబు ఉన్నారు.

ఆచంట: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలతో భారత రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని, దళితులంతా ఈ కుట్రను తిప్పికొట్టి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. దళిత రక్షణ యాత్ర శనివారం ఆచంట నుంచి బయల్దేరింది. ఆచంట కచేరి సెంటర్లో జరిగిన బహిరంగ సభలో సత్యనారాయణ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్ల దళితులకు హక్కులు, స్వేచ్ఛ ఈ మాత్రమైనా లభించాయన్నారు. ఈ తరుణంలో ఆ రాజ్యాంగాన్నే రూపుమాపేందుకు బిజెపి ప్రభుత్వం కుయుక్తులు పన్నుతుందన్నారు. పిఎన్ఎం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్యప్రసాద్, షేక్ వలీ, స్థానిక నాయకులు వద్దిపర్తి అంజిబాబు, ఎస్‌విఎన్.శర్మ, కుసుమే జయరాజు, తలుపూరి బుల్లబ్బాయి, సిర్రా విగ్నేశ్వరుడు, కొండేటి రాఘవులు, మానుకొండ రాంబాబు పాల్గొన్నారు.

పెనుగొండ: అసైన్డ్ భూముల చట్ట సవరణ వల్ల దళితులకు తీరని అన్యాయం జరుగుతోందని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు విమర్శించారు. శనివారం సిద్ధాంతం, పెనుగొండల్లో అంబేద్కర్ కాలనీ వద్ద ఆయన మాట్లాడుతూ దళితుల శ్మశాన వాటికలకు భూముల కేటాయింపు, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల అమలు, ఉపాధి హామీ చట్టం అమలుకు నిధుల కేటాయింపు డిమాండ్లతో ఈ యాత్ర చేపట్టామన్నారు. కార్యక్రమంలో వ్యకాస నేతలు షేక్ పాదుషా, కప్పల రత్నరాజు, సూర్నీడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తణుకు అర్బన్: దళిత పేటల అభివృద్ధి కోసం పోరాడి సాధించుకున్న ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు హెచ్చరించారు. దళిత రక్షణ యాత్ర మూడో రోజు శనివారం కొనసాగింది. తణుకు చేరుకున్న యాత్ర బృందానికి నరేంద్ర సెంటర్‌లో సిఐటియు, మున్సిపల్ కార్మికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను శరవేగంగా అమలు చేస్తుందన్నారు. దళితులపై దాడులు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను అంబాని, అదాని వంటి కార్పొరేట్లకు కట్టబెట్టి దేశ సంపదను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, యాత్రకు సంఘీభావంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష పార్టీలు దళితులను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు బళ్ల చినవీరభద్రం, సిఐటియు జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి, నేత ఎ.అజయకుమారి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.చైతన్య ప్రసాద్, షేక్ వలీ, రాఘవులు, శ్రీను, గార రంగారావు, ఎన్.ఆదినారాయణ బాబు, అయ్యప్ప, మందులయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

గణపవరం: దళితుల సమస్యల పరిష్కారం కోరుతూ జల్లికాకినాడలో శనివారం సంతకాలు సేకరించారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దళిత రక్షణ యాత్ర ఆదివారం మండలానికి రానున్న నేపథ్యంలో ఎస్.సంజీవరావు, సుబ్రహ్మణ్యం మాట్లాడారు. గ్రామంలో డ్రెయినేజీ, తాగునీరు సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఒ.మహేష్, కె.శ్రీనివాస్, వి.శ్రీను, బి.జార్జి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సమస్యలు సత్వర పరిష్కారం

ఏలూరు: ప్రజా ప్రయోజిత సేవల శాశ్వత లోక్ అదాలత్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా ప్రయోజనాల సేవల శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎ.మేరిగ్రేసికుమారి తెలిపారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార భవనంలో శాశ్వత లోక్ అదాలత్ గురించి వివిధ శాఖల ప్రభుత్వాధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరిగ్రేసికుమారి మాట్లాడుతూ జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన ప్రజలు వారి సమస్యలు కోర్టులో వేయకుండా ఉన్నవారికి నేరుగా ప్రజాప్రయోజనాల సేవల శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. వీరికి న్యాయపరంగా ఉచితంగా సమస్యను పరిష్కరించడమే ముఖ్యోద్దేశమన్నారు. ఈ అదాలత్‌లో కోటి రూపాయల వరకు సమస్యను విస్తరించడం జరుగుతుందని తెలిపారు. ఇరుపార్టీల వారిని సమన్వయంతో సామరస్యంగా తక్కువ రోజుల్లో పరిష్కరించి అవార్డు అందజేస్తామన్నారు. శాశ్వత అవార్డు పొందిన తర్వాత ఈ అవార్డును వేరే కోర్టులో అప్పీలు, ఛాలెంజ్ చేసుకునే అవకాశం లేదని తెలిపారు. ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో 10 సమస్యలకు సంబంధించిన కేసులను స్వీకరించడం జరుగుతుందని చెప్పారు. వీటిలో రవాణా, తపాలా, టెలిఫోన్ సర్వీసెస్ సేవలు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, ఆసుపత్రి సర్వీసు, బీమా సేవలు, విద్య, విద్యాసంస్థల సమస్యలు, గృహాలు, రియల్ ఎస్టేట్, బ్యాంకు, ప్రయివేటు ఫైనాన్స్ సంస్థలు, తదితర ప్రభుత్వ సేవలను పరిష్కరించుకోవచ్చని ఆమె తెలిపారు. ఈ సేవలపై ప్రతీశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు.

డిఇఒ కార్యాలయంలో బైఠాయించిన యుటిఎఫ్ నేతలు

అసంబద్ధ సర్దుబాట్లు రద్దు చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి
డిఇఒ కార్యాలయంలో బైఠాయించిన యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అసంబద్ధ పని సర్దుబాటును రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి డిమాండ్ చేశారు. అసంబద్ధ పని సర్దుబాటుకు వ్యతిరేకంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం డిఇఒ కార్యాలయం వద్ద మెరుపు ధర్నా చేపట్టారు. కలెక్టరేట్లోని డిఇఒ కార్యాలయంలో యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడారు. పరపతి ఉన్న వాళ్లకు దగ్గరగా, పరపతి లేని వాళ్లకి దూరంగా పని సర్దుబాటు చేయడం దుర్మార్గమన్నారు. దీనిపై డిఇఒ కార్యాలయ అధికారులను అడిగితే ఏలూరు జిల్లాలో చేశారని, మాకు సంబంధం లేదని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, జిల్లా కార్యదర్శులు రామకృష్ణప్రసాద్, క్రాంతికుమార్, యేసుబాబు, రాష్ట్ర కౌన్సిలర్ రామానుజరావు పాల్గొన్నారు.

ఒపిఎస్ అమలు కోరుతూ ధర్నా

తణుకు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌నే అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. శనివారం స్థానిక తహాశీల్ధార్ కార్యాలయం వద్ద ఫ్యాప్టో, ఎపి సిపిఎస్ఇఎ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహాశీల్ధారు పిఎన్‌డి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో తణుకు కన్వీనర్ టిజె,జయకుమార్, నేతలు జవహర్‌రాజు, ఐ.రాజగోపాల్, శ్రీనుబాబు, భానుప్రకాష్, సిపిఎస్ స్టేట్ కౌన్సిలర్స్ ఐ,రాంబాబు, జి.రవి, కె.ప్రసాద్, కె.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినడమేనా.. పరిష్కరించేదేమైనా ఉందా..!

రెండు జిల్లాల్లో ప్రజలు స్థానిక, వ్యక్తిగత సమస్యలతో సతమతమవుతున్నారు. వాటిలో దీర్ఘకాలిక అంశాలతోపాటు ఇటీవల తలెత్తుతున్న సమస్యలు కూడా ఉంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ప్రారంభించాక ప్రజలు తమ అవసరాల కోసం మండల కార్యాలయాలకు వెళ్లడం తగ్గించారు. అయితే సమస్యలు పేరుకుపోతుండటంతో ప్రతి సోమవారం నిర్వహించే 'స్పందన' కార్యక్రమానికి మండల, డివిజన్, జిల్లాస్థాయిలో అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. అర్జీలన్నీ ఫిర్యాదుదారునికి సంతృప్తినిచ్చేలా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లు పదేపదే సంబంధిత అధికారులను ఆదేశిస్తున్నారు. అయినా అర్జీలు తగ్గకపోవడం పెరుగుతున్న సమస్యలకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ప్రజలకు మరింత సౌలభ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఇటీవల ప్రతి బుధ, శుక్రవారాల్లో జిల్లాలోని రెండు మండల కేంద్రాల్లో 'జగనన్నకు చెబుదాం' పేరిట ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇది ఏలూరు జిల్లాలో మెరుగ్గా సాగుతున్నా పశ్చిమగోదావరి జిల్లాలో వాయిదాల పర్వంతో సాగుతోందనే విమర్శలు విన్పిస్తున్నాయి. దీనికి జిల్లా ఉన్నతాధికారులు హాజరై అర్జీలు స్వీకరిస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉంది. జిల్లా, డివిజన్, మండలం, గ్రామ సచివాలయ స్థాయిలో ప్రతి సోమవారం 'స్పందన' కార్యక్రమం నిర్వహిస్తూ వినతులు స్వీకరిస్తున్నా సమస్యలు ఎందుకు పరిష్కారం కావడం లేదనేది అంతుబట్టని ప్రశ్నగా మిగిలింది. మరి ఇప్పుడు జిల్లా కలెక్టర్ దగ్గర నుంచి జిల్లా అధికారులంతా ఒక్కో మండలానికి వెళ్లి తీసుకుంటున్న అర్జీల పరిష్కారం ఎలా ఉంటుందో వేచిచూడాలి. కొన్ని సమస్యలకు మాత్రం జిల్లా అధికారులు అక్కడికక్కడే పరిష్కారం చూపడం ప్రజలకు ఊరటనిచ్చే అంశం. మిగిలిన అర్జీల మాటేమిటా అనేదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వీటిలో ప్రభుత్వ విధానాలు, ఆర్థిక అంశాలతో ముడిపడినవే ఎక్కువ ఉంటున్నాయని, అలాగే కొన్ని రాజకీయపరమైన ఒత్తిళ్లతో పరిష్కారానికి నోచుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాజకీయ ఒత్తిళ్లను జిల్లా అధికారులు పక్కన పెట్టడంతోపాటు ప్రభుత్వం సైతం ఆయా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తేనే అర్జీల సంఖ్య తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. అప్పుడే ఈ ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపించినట్లని పరిశీలకులు ఘంటాపథంగా చెబుతున్నారు.

ఇక రెండు జిల్లాల్లో మహాకవి గురజాడ అప్పారావు జయంతి వివిధ సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటికీ, నేటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే 'దేశమును ప్రేమించుమన్నా' గేయాన్ని విద్యార్థులచే ఆలాపన చేయించడం అభినందించదగిన విషయం. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో పాలకులు ఎన్నికల ఎత్తుగడలతో స్వదేశీ నినాదం మాటున అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలపై చర్చకు ఈ గేయాలపన అవకాశం ఇచ్చిందనే చెప్పొచ్చు. మహిళా ఓటర్లను ఆకర్షించడమే లక్ష్యంగా గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు చేపట్టిన విధంగానే మహిళా రిజర్వేషన్ బిల్లును తెరపైకి తీసుకొచ్చారనే భావన జిల్లాలోని మహిళా సంఘాల నేతలు సైతం అభిప్రాయపడుతున్నారు. ఇది చట్టమై అమలైతేనే ఎంతోకొంత ఉపయోగముంటుందని, పేరుకే చట్టం తీసుకొచ్చి చేతులు దులుపుకోవడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అప్పుడే నిజమైన దేశభక్తి, మహిళాభక్తి ఉన్నట్లని వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి.

చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌తో ప్రతిపక్ష, అధికార పార్టీలు పరస్పర ఆరోపణ, ప్రత్యారోపణలకు దిగుతున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన అధికార పక్షం, సమస్యలపై నిలదీయాల్సిన ప్రతిపక్షం రెండూ తమ స్వప్రయోజనాల కోసం పాకులాడుతుండటంతో ప్రజా సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటే అతిశయోక్తి కాదు. చంద్రబాబు అరెస్టుపై దీక్షలు, ప్రదర్శనల్లో టిడిపి నిమగ్నమై ఉంది. అధికారపక్షం సందట్లో సడేమియాలా తన ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తోంది. విద్యుత్ ఛార్జీల భారం మోత కొనసాగుతూనే ఉంది. దీనిపై వామపక్షాలు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టి తాజాగా రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించి 27న ధర్నాలకు పిలుపునిచ్చాయి. రాజ్యాంగ పరిరక్షణ, దళితుల హక్కులకు భద్రత, మిగులు భూముల పంపిణీ, ఉపాధి హామీ సక్రమ అమలు తదితర డిమాండ్లతో కెవిపిఎస్, వ్యకాస దళిత రక్షణ చైతన్య యాత్ర ప్రారంభించాయి. ఈ యాత్రలోనూ పాలకులు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్ల పేరుకుపోయిన సమస్యలే తెరపైకొస్తున్నాయి.

ఇక విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ పాలకొల్లులో విద్యాసంస్థలను తనిఖీ చేశారు. లోపాలు గుర్తించి సరి చేసుకోవాలని హెచ్చరించారు. అందరికీ ఆదర్శంగా ఉండాలని ఉపాధ్యాయులకు క్లాస్ తీసుకున్నారు. మరి ఆ ఉపాధ్యాయులకు ఆదర్శంగా తాము కూడా ఉండాలని ఈ ప్రభుత్వం, ఉన్నతాధికారులకు అన్పించడం లేదా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఎక్కువ ఉన్న సిబ్బందిని వెంటనే వేరే పాఠశాలలకు మార్చాలని ఆదేశించారు. సర్దుబాటు చేసినా సరిపడా సిబ్బంది లేకుండా నెట్టుకొస్తున్న పాఠశాలల స్థితిగతులు ఈ అధికారికి పట్టవా అనే విమర్శలు విన్పిస్తున్నాయి. వసతులు కల్పించాం, రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని పదేపదే గొప్పలు చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని అడ్డం పెట్టుకుని పాఠశాలల విలీనంతో ప్రాథమిక పాఠశాలలు బోసిపోతుండగా హైస్కూళ్లు కిటకిటలాడుతున్నాయి. నాడు-నేడు పేరిట అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాలలు నేడు విద్యార్థులు రాక వెలవెలబోతున్న సంగతి తెలియదా. అనాలోచిత నిర్ణయాలు మాని క్షేత్రస్థాయిలో విద్యాబోధనకు ఆటంకంగా ఉన్న అంశాలపై దృష్టి సారిస్తే విద్యావ్యవస్థ సక్రమంగా ముందుకు సాగుతుంది. యాప్‌లు, విద్యాశాఖ, సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాల బకాయిలపైనా దృష్టిసారిస్తున్న దాఖలాల్లేవు. ఇవేమీ పట్టకుండా క్షేత్రస్థాయి పర్యటనల పేరిట సిబ్బందిపై ఒత్తిడి తెచ్చేలా బెదిరింపులకు దిగడం విద్యావ్యవస్థ నిర్వీర్యానికే తప్ప మెరుగుదలకు దోహదపడదని సదరు అధికారికి, ప్రభుత్వానికి తెలియంది కాదు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారంపై నిపుణుల సూచనల మేరకు చర్యలు చేపట్టాలే తప్ప ఉపాధ్యాయులపై వేధింపుల ఆపాలని, లేనిపక్షంలో రానున్న కాలంలో ఈ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఇటు విద్యావేత్తలు, అటు విద్యార్థుల తల్లిదండ్రులు సైతం హెచ్చరిస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

మానసిక వికలాంగులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

యూత్ సర్వీసు మంత్‌లో భాగంగా పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పాలకొల్లు అంజలి మానసిక వికలాంగుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రన్నింగ్, బాస్కెట్ బాల్, త్రోబాల్, క్యారమ్స్, డాన్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ యూత్ సర్వీస్ డైరెక్టర్ మద్దాల వాసు, క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, ట్రెజరర్ ముత్యాల ప్రదీప్, పాస్ట్ ప్రెసిడెంట్ చందక రాము పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన క్రీడా పోటీలు

తాడేపల్లిగూడెం: ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ వారి 18వ వార్షికోత్సవం సందర్భంగా వాకర్స్ గ్రౌండ్ ప్రాంగణంలో శనివారం క్రీడలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కెవి.చలం మాట్లాడుతూ మహిళలు, పురుషులకు నడక పోటీలు, పురుషులకు షార్ట్ పుట్ పోటీలు నిర్వహించామని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు అక్టోబర్ 2వ తేదీన బహుమతులు అందజేస్తామని తెలిపారు. యోగా గురు బడుగు చంద్రశేఖర్ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.కుమారస్వామి, కోశాధికారి పరమాత్మ, అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి బొండాడ ఐజాక్ రాజేంద్ర, జిల్లా డిప్యూటీ గవర్నర్ ప్రవా శ్రీనివాస్, పూర్వ అధ్యక్షులు నాగ వరప్రసాద్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ పేదలకు వరం

ఆచంట : పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అద్భుత పథకం ఆయుష్మాన్ భారత్ అని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలి పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఆయుస్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు సర్పంచి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్డు ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆయుస్మాన్ భారత్ కార్డు ద్వారా రూ.5 లక్షల వరకూ ఉచితంగా చికిత్స చేయడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్య అవసరాల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టాయని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.రూపాంజలి, హెల్త్ అసిస్టెంట్ ఎబి గౌతమ్, ఎఎన్ఎం వెంకట రమణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలపై క్విజ్ పోటీలు

భీమవరం రూరల్ : శాంతి, అహింస, ఆయుధాలుగా స్వాతంత్రాన్ని సాధించిన గాంధీ చరిత్ర యుగాంతం వరకూ సువర్ణ అధ్యాయమని కెజిఆర్ఎల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మెంటే హరినాథ్ బాబు తెలిపారు. శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాంధీ జయంతి పక్షోత్సవాల్లో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో ర్యాలీ, గాంధీజీ ఆశయాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీ డైరెక్టర్ తోట రామ్మూర్తి, బిఫార్మసీ డైరెక్టర్ కవల నాగేశ్వరరావు మాట్లాడారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఐ.రామచంద్రమూర్తి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సత్యనారాయణ, జ్యోతి, చాయ, నాచు శ్రీవల్లీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి మాతృమూర్తులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నేటి బాలలే రేపటి మాతృమూర్తులని మహిళా సంఘం ప్రతినిధి, ఉపాధ్యాయిని అడపా సత్యవతి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ కుమార్తెల దినోత్సవాన్ని నిర్వహించారు. సత్యవతి మాట్లాడుతూ దేశంలోని స్త్రీల కట్టుబాట్లు, ఆచారాలు, సంప్రదాయాలు ప్రపంచంలోనే గుర్తింపు పొందాయన్నారు. పురాణ కాలం నుంచి ఆడపిల్లలకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం బాలలకు స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ప్రజా నాట్య మండలి జిల్లా సభ్యులు ఎస్‌కె.చాన్‌పాషా, కళారంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాధి శ్రీనివాస్, చైతన్య భారతి నాటక పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

కాశిపాడులో ఇంటింటా సర్వే

గణపవరం: కాశిపాడులో శనివారం పిప్పర పిహెచ్‌సి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించినట్లు డాక్టర్ కె.ప్రియాంక తెలిపారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ సర్వేలో స్థానికులకు బిపి, షుగర్ ఇతర ఆరోగ్య కారణాలు నమోదు చేసుకొని వచ్చే నెల 7వ తేదీన ఉప కేంద్రం వద్ద ఏర్పాటు చేసి మెడికల్ క్యాంపులో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తామని చెప్పారు. వైద్య శాఖాధికారులు తమ ఇంటి ముందుకు వచ్చినప్పుడు సహకరించి వారికి ఉన్న దీర్ఘకాలిక రోగాలు ఇతర అనారోగ్య వివరాలు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కోట నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఆర్‌డి.రామారావు, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎస్ఆర్‌కెఆర్ విద్యార్థినుల ఎంపిక

తణుకురూరల్: ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 21న ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల భీమవరంలో నిర్వహించారని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థినులు జిల్లా స్థాయిలో పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో చక్కటి ప్రతిభను కనబర్చి డిసెంబరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు అభినందించారు. కార్యక్రమంలో కల్చరల్ విభాగం అధ్యాపకులు పి.శివప్రసాద్, కె.శ్యామలాదేవి పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి

ఉండి: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలని ఇండియన్ డిజిటల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ కలిశెట్టి విజయ్‌కృష్ణ అన్నారు. శనివారం పాఠశాలలో ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కృష్ణ మాట్లాడుతూ ప్రతి రంగంలోనూ విద్యార్థులు రాణించాలని తెలిపారు. ఈ పోటీల్లో ఎక్కువగా విద్యార్థులు స్వాతంత్ర సమరయోధులు, రైతుల వేషధారణలో పాల్గొన్నారని తెలిపారు. కాంపిటేషన్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె.రజనీకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు వర్మీ కంపోస్టు ఎరువుల పంపిణీ

ఆచంట: వానపాముల వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువులు తయారుచేసి వాటిని రైతులకు ఉచితంగా అందించడం గర్వించదగ్గర విషయమని వల్లూరు సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు తెలిపారు. శనివారం వల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛతి హీ సేవా కార్యక్రమంలో భాగంగా వల్లూరు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డులో తయారుచేసిన వర్మీ కంపోస్ట్ ఎరువులను రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సర్పంచి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ చెత్త నుంచి సంపదను తయారు చేసి పంచాయతీకి అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుని తద్వారా వాటిని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ వర్మీ కంపోస్టు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

రెగ్యులరైజేషన్ కోరుతూ 25న విజయవాడలో ధర్నా

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్

భీమవరం: సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బొక్కా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 25న విజయవాడలో జరిగే ధర్నాలో జిల్లాలోని ఉద్యోగులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, పార్ట్‌టైం ఉద్యోగుల జిల్లా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, టైం స్కేల్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు పి.సుబ్బారావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కేర్ లీవులు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆనంద్, ఎం.బాలరాజు, రవి ప్రసాద్, పి.వినయ్, టి.చినబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రాజకీయ కక్షతోనే చంద్రబాబుపై కేసులు

11వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రబాబు అక్రమ అరెస్టుపై టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం కొనసాగాయి. దీక్షలు వీరవాసరం మండల, భీమవరం పట్టణ టిడిపి నాయకులతో పాటు జనసేన మిత్రపక్షాల నాయకులు సంఘీభావంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంద్ర శ్రీనివాస్, జనసేన పొలిటికల్స్ ఎఫైర్స్ మెంబర్ కనకరాజు సూరి, మండల ఉపాధ్యక్షులు యరరాజు గోపాలకృష్ణరాజు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

పాలకొల్లు : పట్టణంలోని ఎల్ఆర్ పేటలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ జూనియర్, సీనియర్ కాలేజీ విద్యార్థులకు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు శనివారం చంద్రబాబు అక్రమ అరెస్టుపై ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ యువత భవిష్యత్తు అంతా చంద్రబాబు చేతుల్లో ఉందని చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు దిగి చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టిందని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నిర్వహిస్తున్న దీక్షలు 11వ రోజుకు చేరాయి. బుడగ, జంగం రాష్ట్ర సంఘం నేతలు దీక్షల్లో కూర్చున్నారు. వారిని ఎంఎల్ఎ అభినందించి వారి సమస్యల పరిష్కారానికి అసెంబ్లీ వేదికగా పోరాడతానని చెప్పారు. వారు తమ కళా ప్రదర్శన ద్వారా పలువురిని ఆకట్టుకున్నారు.

ఆచంట : చంద్రబాబుపై రాజకీయ కక్షతో అక్రమ కేసులు బనాయించడం దారుణమని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 11వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో పితాని వెంకట్, టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, సర్పంచులు గుబ్బల మాధవరావు, నేలపూడి బేబి రామ్మోహనరావు, ఎంపిటిసి బాలం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మొగల్తూరు : చంద్రబాబును వైసిపి ప్రభుత్వం రాజకీయ కక్షతో వేధిస్తోందని టిడిపి నాయకులు విమర్శించారు. ముత్యాలపల్లిలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి నేతలు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో నాయుడు రాంబాబు, కొల్లాటి బాలకృష్ణ, దొంగ శ్రీను, కొల్లాటి నాగేశ్వరరావు, పెంటయ్య, మూలస్వామి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లలోపు క్యాల్షియం, ఐరన్ లోపం ఉన్న చిన్నారులకు సిరప్, క్యాప్సిల్స్ తానే ఉచితంగా అందిస్తానని ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి) అన్నారు. శనివారం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం ఐసిడిఎస్ సిడిపిఒ ఎ.కృష్ణ కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వాసురెడ్డి, ఎంపిడిఒ పి.పద్మజ మాట్లాడుతూ శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం తోడ్పడుతుందన్నారు. గ్రామస్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఎంపిటిసి-2 గంటి రామారావు, ఆలమూరు వైద్యులు కె.ప్రదీప్ కుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం మొగల్తూరు పంచాయతీ పరిధి సత్రవపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు, చిన్నారులకు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎన్.పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ డి.అనిల్‌కుమారి అన్నారు. భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం గొల్లవానితిప్ప సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమారి మాట్లాడుతూ గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకోకపోతే రక్తహీనత ఏర్పడి ప్రసవించే సమయంలో అనేక ఇబ్బంది ఎదుర్కొంటారన్నారు. కార్యక్రమంలో గొల్లవానితిప్ప హైస్కూల్ హెచ్ఎం సిహెచ్‌వి.ప్రసాద్, ఎఎన్ఎం డివిఎన్‌వి.సత్యవతి, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

పోడూరు : గుమ్మలూరులో పోషణ మహోత్సవం కార్యక్రమం శనివారం జరిగింది. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ ఐసిడిఎస్ సిడిపిఒ సిహెచ్ ఇందిర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సర్పంచి గొట్టుముక్కల సోనియారాణి మాట్లాడుతూ శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు పోతాబత్తుల లక్ష్మీదుర్గ, అంబటి సుధాకర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగపద్మ, పంచాయతీ కార్యదర్శి కృష్ణవర్మ పాల్గొన్నారు.

ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ

ప్రజాశక్తి- తణుకు

సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో తణుకు జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాలలోని 162 మంది విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు పంపిణీ చేశారు. శనివారం స్కూల్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ అధినేతలు కర్రి శ్రీనివాసుల రెడ్డి, కర్రి సూర్యప్రభ ఆర్థిక సాయంతో ఉచితంగా బస్ పాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. డిపో మేనేజర్ మూర్తి ఫౌండేషన్ అధినేతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసుల రెడ్డి తనయుడు యశ్వంత్ రెడ్డి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని ముప్పిడిశెట్టి హేమ మాలిని, డిపో ఉద్యోగి సుబ్బారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25వ తేదీన చలో విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని అంగన్‌వాడీల జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల రూరల్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. పని భారం పెరిగిందని, సెంటర్ అద్దె, కరెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, కనీస వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సెక్టార్ నాయకులు ఎం.జ్యోతి, టి.లక్ష్మి, పి.రాధా జయలక్ష్మి, ఎం.రాజకుమారి, కె.వరహాలు, ఎం.ప్రభావతి, పివి.లక్ష్మి, యు.సత్యశ్రీ, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, ఎ.అజయ్‌కుమారి పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న కళ్యాణి

రైతులు వెదజల్లే పద్ధతిని అమలు చేయాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రస్తుతం కూలీల కొరత పెరిగిన నేపథ్యంలో వెదజల్లే పద్ధతిని రైతులు పాటించాలని, వెదజల్లే పద్ధతి వల్ల ఉపయోగాలెన్నో ఉన్నాయని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. శనివారం పరిశోధనా స్థానం వద్ద శిక్షణ, సందర్శన నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మారుతున్న కాలమాన పరిస్థితుల కారణంగా, రైతులు విపరీతమైన కూలీల కొరత, కూలీ ఖర్చు పెరిగిపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యలను అధిగమించడానికి వెదజల్లే పద్ధతిని ఆచరించాలని తెలిపారు. తాడేపల్లిగూడెం డివిజన్లో ఎక్కువగా సాగుచేస్తున్న పిఆర్ 126 వంటి పొడవుగింజ రకాలకు ప్రత్యామ్నాయ రకాలైన సన్నగింజ రకాలను గుర్తించాల్సిన బాధ్యత శాస్త్రవేత్తలపై ఉందని తెలిపారు. వచ్చే సంవత్సరానికల్లా అందుబాటులో ఉన్న ఎంటియు 1271, ఎంటియు 1282 ప్రత్యామ్నాయ రకాలపై క్షేత్ర పరిశీలనలను చేపట్టాలని శాస్త్రవేత్తలను ఆదేశించారు. సుమారు 90 శాతం సాధారణ విస్తీర్ణంలో నాట్లు పూర్తయ్యాయని, మురుగునీటి సమస్య, పట్టణీకరణ చేపల చెరువుల తవ్వకం వంటి కారణాల వల్ల మిగిలిన 10 శాతం విస్తీర్ణంలో నాట్లు పడే అవకాశం లేదని తెలిపారు. పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానం నుండి వచ్చిన డాక్టర్ ఐ.సుధీర్ కుమార్, సీనియర్ శాస్త్రవేత్తలు పెసర, మినుము, మొక్కజొన్న పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి అధికారులకు శిక్షణ ఇచ్చారు.

నేడు ఎఎంసి వైస్ ఛైర్మన్‌గా రాజా నరేంద్రకుమార్ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉండి ఎఎంసి వైస్ ఛైర్మన్‌గా నియమితులైన గొల్లలకోడేరు గ్రామానికి చెందిన వైసిపి గ్రామ కన్వీనర్ చేకూరి రాజా నరేంద్ర కుమార్ ఆదివారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. గొల్లలకోడేరు నుంచి ఉండి మార్కెట్ యాడ్ వరకూ వైసిపి కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామస్తుల నడుమ భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి పార్టీ శ్రేణులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు నేతృత్వంలో పాలకోడేరు ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) ఆధ్వర్యంలో రాజానరేంద్ర కుమార్ ప్రమాణ స్వీకారానికి ర్యాలీగా వెళ్లనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, టిటిడి బోర్డు మెంబర్ మేకా శేషుబాబు, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ గంటా పద్మశ్రీ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాస్ రాజు (వాసు), డిసిఎంఎస్ ఛైర్మన్ వేంద్ర వెంకటస్వామి హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఎఎంసి వైస్ ఛైర్మన్ నరేంద్ర కుమార్ ప్రజాశక్తితో మాట్లాడారు. ఎఎంసి అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి పదవి కేటాయించిన పివిఎల్ నరసింహరాజుకు రుణపడి ఉన్నానని తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సిపిఎం సీనియర్ నేత సత్యనారాయణ మృతి

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని లక్ష్మీపాలెం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నేత బొబ్బిలి సత్యనారాయణ (65) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్యనారాయణ మృతి వార్త తెలుసుకున్న సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు బాతి జార్జి, నాయకులు కొప్పిశెట్టి సత్యనారాయణ, శీలం సత్యనారాయణ లక్ష్మీపాలెం వెళ్లి సత్యనారాయణ భౌతికాయాన్ని సందర్శించి ఎర్రజెండాను కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాల మాట్లాడుతూ సిపిఎంలో నిబద్ధత కలిగిన నాయకునిగా పనిచేసిన సత్యనారాయణ మృతి పార్టీకి తీరని లోటని అన్నారు.

సత్యనారాయణ భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పిస్తున్న నాయకులు

ఓటేసేందుకు అనువుగా పోలింగ్ కేంద్రాలు

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - పాలకోడేరు

ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం పాలకోడేరు, మోగల్లు గ్రామాల్లో ఆమె పర్యటించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పాలకోడేరు 51, 53, 57, మోగల్లులో 46వ నెంబరు పోలింగ్ కేంద్రాల్లోని వసతులపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ డాక్టర్ ఆర్‌సి.ఆనందకుమార్, తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపిడిఒ ఎన్ఎం.గంగాధరరావు ఉన్నారు.

ఉండి: అన్ని వసతులతో పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం ఉండి కాపులపేట 67, 69 పోలింగ్ స్టేషన్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గదులు, విద్యుత్, తలుపులు, కిటికీలు, మరుగుదొడ్లు, ర్యాంపులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు కిలోమీటర్ల పరిధిలోపు పోలింగ్ స్టేషన్‌ను కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు.

వీరవాసరం: పోలింగ్ కేంద్రాల రేషన్‌లైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి నివేదికలు పంపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మండలంలో తోలేరు, నౌడూరు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గదుల్లో విద్యుత్, తలుపులు, కిటికీలు, టాయిలెట్స్, ర్యాంపు, పరిసరాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ అతి ముఖ్యమైందన్నారు. కలెక్టర్ వెంట గృహనిర్మాణ శాఖ పీడీ డాక్టర్ ఆర్‌సి.ఆనందకుమార్, తహశీల్దారు ఎం.సుందరరాజు, ఎంపిడిఒ కె.జ్యోతి, డిఇ విఎన్.వేణుగోపాల్, ఎఇ కె.శ్రీరామచంద్రమూర్తి ఉన్నారు.

ర్యాగింగ్ నేరం

జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్

ప్రజాశక్తి - పాలకోడేరు

ర్యాగింగ్ చేసినా, చేసేందుకు సహాయపడినా చట్టప్రకారం నేరమని భీమవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్ కుమార్ తెలిపారు. పెన్నాడలోని భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం మండల లీగల్‌సెల్, బైట్ కళాశాల ఆధ్వర్యంలో ఎరాడికేషన్ ఆఫ్ ర్యాగింగ్ ఇన్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ అంశంపై సీనియర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ మాట్లాడారు. భీమవరం బార్ అసోసియేషన్ సెక్రటరీ పి.రమేష్‌బాబు, అడ్వకేట్స్ ఎ.రాజేష్, ఎన్.సుధీర్, పాలకోడేరు సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నాలం శ్రీనివాసరావు విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఒకసారి ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదైతే జీవితాంతం విద్య, ఉద్యోగావకాశాలను పూర్తిగా కోల్పోతారన్నారు. విద్యార్థులతో సోదర భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో శాంతి హాస్పిటల్ వైద్యులు సుభాష్, బైట్ ప్రిన్సిపల్ కొప్పర్తి సురేష్, డైరెక్టర్లు అడబాల సాయితేజ, హర్షతేజ పాల్గొన్నారు.

సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

వాలంటీర్లు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని నరసాపురం 7వ ఆంధ్ర నావల్ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ జి.భరత్‌భూషణ్ తెలిపారు. వైఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి జి.భరత్ భూషణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వాలంటీర్లు చదువుతో పాటు సేవాభావాన్ని పెంచుకోవాలని, సమయపాలన కలిగి ఉండాలని, లీడర్షిప్ స్కిల్స్ పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఎపివి.అప్పారావు అధ్యక్షత వహించగా, కళాశాల డీన్ గంధం రామకృష్ణ ముఖ్యఅతిథిని సభకు పరిచయం చేశారు. వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.కనకారావు, హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ చినమిల్లి శ్రీనివాస్ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించండి

ప్రజాశక్తి - వీరవాసరం

మార్చి 2024లో నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు పరీక్ష ఫీజును ఈ నెల 30వ తేదీలోగా చెల్లించాలని కళాశాల ప్రిన్సిపల్ ఎం.బలరామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023, అంతక ముందు ఫెయిల్ అయిన ప్రయివేటు విద్యార్థులు కూడా ఈ తేదీలోపు చెల్లించాలన్నారు. ఫీజు చెల్లించేటప్పుడు అభ్యర్థులు తమ ఆధార్‌కార్డు జిరాక్స్, ఫొటో, ఆఖరుగా రాసిన పరీక్షలకు సంబంధించిన మార్కుల మెమో అందజేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

కాళ్లకూరులో అన్న సమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులోని సగర్లపేటలో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేశుని మండపం వద్ద దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దాట్ల వెంకట రామరాజు, మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు పాల్గొని ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ దాట్ల శ్రీదేవి ట్రస్టు ద్వారా గ్రామంలో పేద ప్రజలకు ఆర్థిక సాయంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. గ్రామంలో విరివిగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ ఛైర్మన్ అడ్డాల నాగరాజు, వైసిపి నాయకులు వేగేశ్న రవితేజ, దాట్ల బంగార్రాజు, కమిటీ సభ్యులు ఇబ్బా రాంబాబు, పెరుమాళ్ల స్వామి, ఏడుకొండలు పాల్గొన్నారు.

పలు చోట్ల గణపతి నిమజ్జనాలు

ఉండి: గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా ఎన్‌ఆర్‌పి అగ్రహారం బిసి కాలనీలోని వరసిద్ధి వినాయక నిమజ్జన కార్యక్రమం డప్పులు, తీన్మార్, డీజే, యువకుల నృత్యాల నడుమ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మునుకోలు సింహాచలం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారిని ఘనంగా ఊరేగించారు. మేళ తాళాలతో, బాణాసంచాతో ఊరేగింపు నిర్వహించి నిమగ్నం చేశారు.

సీజ్డ్ కారు వేలం

పెనుమంట్ర: మద్యం కేసులో సీజ్ చేసిన కారును వేలం పాట వేసినట్లు ఎస్ఐ షేక్ మదీనా భాషా తెలిపారు. శనివారం స్థానిక స్టేషన్‌లో స్కార్పొ కారును వేలం పాటలో ఆలమూరుకు చెందిన గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి పాడుకున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.60 వేలకు గాను రూ.500 అధికంగా వేసి రూ.60,500లకు పాడుకున్నారని తెలిపారు. అదే విధంగా దానిపై 18 శాతం జిఎస్‌టి చెల్లించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తణుకు ఎస్ఇబిఇ ఇన్‌స్పెక్టర్ రాగులు గీత, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్లు అందజేత

ప్రజాశక్తి - పోడూరు

గుమ్మలూరు శ్రీపూసపాటి కుమారస్వామి రాజా జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు రెండు కంప్యూటర్లను శనివారం పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కుక్కల బేబీ విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ పాఠశాలలో 1977-78 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నత వ్యాపారవేత్తలుగా ఉన్న పూర్వ విద్యార్థులు నడింపల్లి వెంకట సూర్యనారాయణ రాజు, రుద్రరాజు రామలింగరాజు, పెనుమత్స బోసురాజు పాఠశాలకు కంప్యూటర్లు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను పాఠశాల సిబ్బంది అభినందించారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, వీరవాసరం మండలం, మత్స్యపురి గ్రామం, పెదపేట డోర్ నెం. 1-16 కాపురస్తులు దిడ్ల వెంకటలక్ష్మి, W/o. దిడ్ల శ్రీను అను నేను ది. 21-09-2023వ తేదీన విదేశములకు జీవనోపాధి నిమిత్తం వెళ్లి తిరిగి ఇండియాలో గల నా స్వగ్రామమునకు వచ్చుచుండగా హైదరాబాద్ నుండి భీమవరం కొత్త బస్టాండ్‌లో దిగి నా స్వగ్రామం అయిన మత్స్యపురి గ్రామానికి ఆటోలో వెళ్లుచుండగా మార్గం మధ్యలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు వున్న బ్యాగ్ పడిపోయినది. నెం. **M5707923** గల నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. కావున దొరికినవారు ఈ క్రింది నెంబర్‌కి తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

దిడ్ల వెంకటలక్ష్మి, W/o. దిడ్ల శ్రీను
మత్స్యపురి, వీరవాసరం మండలం
పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 9000373825

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 48/2012

వాద్లు: వీరవల్లి నరశింహులు (died) and 4 Others
ప్రతివాద్లు: వీరవల్లి జానకి రామారావు and Others
6వ ప్రతివాది: వీరవల్లి నాగేశ్వరరావు, S/o. late విశ్వనాథం, వయస్సు 30 సంllలు, పెద్దింట్లమ్మ గుడి దగ్గర, డోర్ నెం. 13-65, బంటుమిల్లి, పాలకోడేరు మండలం, పllగోllజిల్లా, BJCJC.
7వ ప్రతివాది: వీరవల్లి దుర్గారావు, S/o. late విశ్వనాథం, వయస్సు 28 సంllలు, పెద్దింట్లమ్మ గుడి దగ్గర, డోర్ నెం. 13-65, బంటుమిల్లి, పాలకోడేరు మండలం, పllగోllజిల్లా, BJCJC.

పై నెంబరు దావాలో 6, 7 ప్రతివాదులకు శ్రీ కోర్టు ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించినప్పటికిన్ని సదరు 6, 7 ప్రతివాదులు ఉద్దేశ్యపూర్వకంగా Avoid చేయుచున్నారు. కావున సదరు 6, 7 ప్రతివాదులు హాజరు నిమిత్తము **ది. 06-10-2023 సంllరం తేదీకి వాయిదా అయివున్నది.** సదరు తేదీన సదరు 6, 7 ప్రతివాదులు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట **ఉదయం గంll 10.30 నిllలకు** హాజరు కావలెను. లేనియెడల సదరు 6, 7 ప్రతివాదులు పరోక్షమందు పై నెంబరు దావా తీర్మానించబడును.

K.SOMA SEKHARA PRASAD
భీమవరం Advocate, Bhimavaram
ది.19-9-2023 Cell: 9848777584